క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ అనంతాచారి

ఓడీచెరువు : తహసీల్దార్‌గా అనంతాచారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు జిల్లా వెల్దుర్తి నుంచి ఓడీచెరువు మండలానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

జీఓ 117 రద్దు చేయాలి

తనకల్లు: జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్సీలో ఎంఈఓ లలితమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులను ఒకే పాఠశాలగా నడపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయింపు నివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు తాహిర్ వలి, మండల నాయకులు సుండుపల్లి గణేష్, ఖాజా మోహిద్దీన్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం మదిరేబైలు తండా వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామకృష్ణానాయక్ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి సోమవారం గ్రామానికెళ్లి కార్యకర్త మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ లక్ష్మీనాయక్, ఎంపీటీసీ హర్షవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

మొక్కలు నాటిన విదేశీయులు


మొక్కలు నాటుతున్న విదేశీయులు, దాతలు

పుట్టపర్తి అర్బన్: వెంగళమ్మచెరువు ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఆవరణల్లో పీఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విదేశీయులు మొక్కలు నాటారు. సౌతాఫ్రికాకు చెందిన సాయి భక్తులు ఫ్రాన్సెస్‌స్కోతమ్మ, లవ్ ఇన్ యాక్షన్ వారి సహకారంతో పాఠశాలల్లో 123 వేప, కానుగ, తవిశ, సీమచింత, తెల్లమద్ది, నేరేడు, మారేడు, వెలమ, పనస, రావి, చింత, ఉసిరి వివిధ రకాల పూల మొక్కలను నాటి, వాటికి సంరక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఆర్‌డీఎస్ సెక్రెటరీ ప్రభాకర్‌రెడ్డి, లలితా జవహర్‌లాల్, యాంజిలా డిక్షన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను వెంటనే ఆదుకోండి

చెన్నేకొత్తపల్లి: ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సమయం ముగుస్తుండటంతో ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సీపీఐ నాయకులు తెలిపారు. రైతులను వెంటనే ఆదుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ హమీద్‌బాషాను కలసి వినతిపత్రం అందజేశారు. నాయకులు నాగరాజు, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందాలి

చెన్నేకొత్తపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ సెల్వియా సాల్మాన్ వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం ప్యాదిండిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగాంను పర్యవేక్షించారు. ఎన్ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రవినాయక్, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

పూడికతీత ప్రారంభం

చెన్నేకొత్తపల్లి: గువ్వలగొందిపల్లిలో సోమవారం టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో పూడికతీత పనులు ప్రారంభించారు. రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ మేనేజర్ పేరూరి శ్రీకాంత్, కో–ఆర్డినేటర్ రవి మాట్లాడుతూ నేలచెలిమి వంక చెక్‌డ్యాం, గొందిచెలిమి మరమ్మతులు, పూడికతీత చేపట్టామన్నారు. రొద్దం, రామగిరి, సీకేపల్లి మండలాల్లోని 16 గ్రామాల్లో పూడికతీత చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వెంకటరమణప్ప, నారాయణస్వామి, ముత్యాలయ్య పాల్గొన్నారు.

ఎస్‌ఐ పూరేనాయక్‌కు సన్మానం


ఎస్‌ఐను సన్మానించిన దృశ్యం

కదిరి టౌన్: తిరుపతికి బదిలీ అయిన కదిరి పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ పూరేనాయక్‌కు సోమవారం సీఐ పుల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఎస్‌ఐ బాబ్జాన్, ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



ముదిగుబ్బ రైల్వే స్టేషన్ ముఖద్వారం


ముదిగుబ్బ స్టేషన్‌లో ఆగిన నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు

రైలుబండి.. ఆగేదెప్పుడండి

చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులతో ముదిగుబ్బ రైల్వే స్టేషన్ కిటకిటలాడుతుంటుంది. ఇక్కడి నుంచి సుదూర ప్రాంతాలకు రైలులో ప్రయాణిస్తుంటారు. ప్యాసింజర్ రైలుతో పాటు ఒక ఎక్స్‌ప్రెస్ రైలు మాత్రమే ఆపుతున్నారు. మరో ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ముదిగుబ్బ స్టేషన్‌లో స్టాపింగ్ లేదు. ఎక్స్‌ప్రెస్‌లో జర్నీ కోసం ప్రయాణికులు దశాబ్దాలుగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

- ముదిగుబ్బలో ప్రయాణికుల తాకిడి
- దూసుకుపోతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- ఏడింటిలో ఒకటే ఆగుతాదండి
- దూరప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ జర్నీ కలేనా..?


రైల్వే స్టేషన్‌లో టాయిలెట్లను వినియోగించకుండా తాళం వేసిన దృశ్యం

ముదిగుబ్బ: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లో ధర్మవరం జంక్షన్ నుంచి ముదిగుబ్బ మీదుగా ఏడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముదిగుబ్బ అతి పెద్ద మండలం. దశాబ్దాల కిందటే ఇక్కడ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసి మీటర్ గేజ్ రైళ్లు నడిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బ్రాడ్‌గేజ్ లైను నిర్మాణంతో పాటు విద్యుత్ లైను పనులు కూడా జరిగాయి. బత్తలపల్లి, నల్లమాడ, పులివెందుల, బుక్కపట్నం మండలాల నుంచి వందలాదిమంది ప్రయాణికులు, విద్యార్థులు ముదిగుబ్బ స్టేషన్‌కు వచ్చి రైళ్లలో వెళ్తుంటారు. రోజూ తిరుపతి – గుంతకల్లు ప్యాసింజర్ రైళ్లు వెళ్తుంటాయి. అయితే బోగీలు తక్కువగా ఉండడం వల్ల ప్రయాణికులు సీట్లు దొరక్క ఇబ్బందులు పడుతుంటారు.

» ముదిగుబ్బ మీదుగా వెళ్తున్న ఏడు ఎక్స్‌ప్రెస్‌లలో ధర్మవరం నుంచి నర్సాపూర్ వెళ్లే రైలు మాత్రమే ఆగుతోంది. మిగతా ఆరులో 'పద్మావతి ఎక్స్‌ప్రెస్' రైలు కాచిగూడ నుంచి తిరుపతికి వెళ్లేటప్పుడు మాత్రమే ముదిగుబ్బలో నిలుపుతున్నారు. తిరుపతి నుంచి కాచిగూడ వెళ్లే సమయంలో ఆపడం లేదు. కోలా ఎక్స్‌ప్రెస్ వారంలో ఒక రోజు, పద్మావతి ఎక్స్‌ప్రెస్ వారంలో రెండు రోజులు, నాగర్‌కోయిల్ నుంచి ముంబై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు వారంలో నాలుగు రోజులు, అమరావతి – తిరుపతి ఎక్స్‌ప్రెస్ వారంలో రెండు రోజులు, సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్ వారంలో రెండు రోజులు, కాచిగూడ – మధురై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు వారంలో ఒక రోజు నడుస్తున్నాయి. ముదిగుబ్బలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపే విధంగా చర్యలు చేపట్టాలని గతంలో ఎంతోమంది ఎంపీలకు అర్జీలు ఇచ్చినా, విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే కదిరి, ధర్మవరం వెళ్లి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కాల్సి వస్తోంది. అదే ముదిగుబ్బలో ఆపితే చాలా మందికి సౌకర్యంగా ఉంటుంది.

స్టేషన్‌లో సమస్యల కూత

ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే శాఖ మరుగుదొడ్లు ఏర్పాటు చేసింది. అయితే వాటికి ఎప్పుడూ తాళం వేసి ఉండడంతో ప్రయాణికులు ఉపయోగించుకోలేకపోతున్నారు. శుద్ధిజలాల బదులు ఉప్పునీరు వస్తుండడంతో వాటినే తాగాల్సి వస్తోంది. స్టేషన్ పరిసర ప్రాంతాలలో ముళ్ల పొదలు అధికంగా ఉండడం వల్ల అందులో పాములు చేరుకొని ప్రయాణికులను ఇబ్బందులు పెడుతున్నాయి.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి



ఎక్స్‌ప్రెస్ రైళ్లు ముదిగుబ్బలో ఆగకుండా పోతున్నాయి. స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ రిజర్వేషన్ చేసుకొని పక్క రైల్వే స్టేషన్‌కు వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోంది. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపే విధంగా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలను మెరుగుపరచాల్సి అవసరం ఉంది.

– బండల వెంకటేష్, ముదిగుబ్బ

ఆదాయం పెరుగుతుంది



అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లు ముదిగుబ్బలో ఆపితే ఎక్కువ శాతం ప్రయాణీకులు రైళ్లలోనే ప్రయాణిస్తారు. దీంతో రైల్వే శాఖకు ఆదాయం పెరుగుతుంది. అదే విధంగా గుంతకల్లు ప్యాసింజర్‌కు బోగీలు తక్కువగా ఉండడంతో ప్రయాణికులు కిక్కిరిసిపోతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలి.

– రామకృష్ణ, గుంజేపల్లి

నీట్‌లో మెరిసిన గూనిపల్లి విద్యార్థిని


సాయి ఉన్మేషకు స్వీటు తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

పుట్టపర్తి: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)లో బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన విద్యార్థిని సాయి ఉన్మేష మెరిసింది. ఎర్రగుడి హనుమంతరెడ్డి, కవిత దంపతుల కుమార్తె సాయి ఉన్మేష ఇటీవల విడుదలైన తెలంగాణ–నీట్ ఫలితాల్లో 2,562వ ర్యాంకు సాధించింది. తెలంగాణలోని టాప్–10 కాలేజీల్లోనే ఎంబీబీఎస్ సీటు రానుంది. ఈ గ్రామం నుంచి మెడికల్ సీటు సాధించిన తొలి విద్యార్థినిగా ఉన్మేష నిలిచింది. భగవాన్ సత్యసాయిబాబా ఆశీస్సులతో పాటు డాక్టర్లు సనీనస్‌రెడ్డి, అశోక్‌వర్ధన్‌రెడ్డి, ఇంటి యజమాని శంకర్, పద్మాంజలి తదితరుల సలహాలు, సూచనలతో చదివి సీటు సాధించిందని అమ్మాయి తల్లిదండ్రులు తెలిపారు.

సైనికులకు వైద్య సేవలందిస్తా

భగవాన్ సత్యసాయిబాబా చూపిన సేవా మార్గంలో నడుచుకుంటానని సాయి ఉన్మేష తెలిపింది. వైద్య కోర్సు పూర్తి చేసి దేశ సేవకు అంకితమైన సైనికులకు సేవ చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పింది.

నీట్ ఫలితాల్లో ముదిగుబ్బ విద్యార్థి ప్రతిభ


గణేష్‌నాయక్

ముదిగుబ్బ: రాష్ట్రస్థాయి నీట్ ఫలితాల్లో ముదిగుబ్బకు చెందిన వెంకటేష్ నాయక్, తులసిబాయి దంపతుల కుమారుడు గణేష్ నాయక్ 651/720 మార్కులతో ఎస్టీ కేటగిరిలో ఐదో ర్యాంకు సాధించాడు. కుమారుడికి తల్లిదండ్రులు కేక్ తినిపించి సంబరాలు చేసుకున్నారు. కోర్సు పూర్తి చేసి పేదలకు మెరుగైన వైద్యం అందిస్తానని గణేష్ నాయక్ తెలిపాడు.

రైతులకు పెట్టుబడి సాయమందించాలి

తాడిమర్రి: ఎన్నికల హామీ మేరకు ప్రతి రైతుకూ రూ.20 వేలు పెట్టుబడి సాయం వెంటనే అందజేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కమతం కాటమయ్య మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావం నెలకొని ఉన్నందున, ఇప్పటివరకు కనీసం 20 శాతం భూముల్లో కూడా విత్తనం పడలేదన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం రైతులకు వంద శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలన్నారు. రైతుల రుణాలను రూ.2 లక్షలు దాకా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. 90 శాతం సబ్సిడీతో బిందు తుంపర సేద్య పరికరాలు అందివ్వాలన్నారు. హంద్రీ–నీవా ద్వారా ఆయకట్టుకు నీరు ఇవ్వడానికి పంట కాలువలను పూర్తి చేయాలన్నారు. 60 ఏళ్లు నిండిన ప్రతి రైతుకూ రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ భాస్కర్‌రెడ్డికి అందజేశారు.


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

రైతు సమస్యలు పరిష్కరించండి

తనకల్లు: రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20వేలు అందజేయాలని సీపీఐ నాయకులు సోమవారం తనకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. రైతు సమస్యలపై తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రెడ్డెప్ప, నాయకులు చౌడప్పయాదవ్, కరీముల్లా, చంద్రానాయక్, రవీంద్రా నాయక్, గంగన్న, వెంకటమ్మ, ఆనంద్, క్రిష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

'నిడిమామిడి' భూముల్లో ఇళ్ల పట్టాలివ్వాలి

- రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించిన పేదలు

బత్తలపల్లి: నిడిమామిడి ట్రస్ట్‌కు చెందిన భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి ఇళ్ల పట్టాలివ్వాలని సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో పేదలు బత్తలపల్లి రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు మాట్లాడుతూ 401 సర్వే నంబర్‌లోని 19.84 ఎకరాల భూమి 2023లో నిడిమామిడి ట్రస్ట్‌కు సంబంధించినదిగా ప్రభుత్వ రికార్డుల్లోనూ, ఆన్‌లైన్‌లోనూ ఉన్నట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారన్నారు. 2024లో అదే భూమి పిత్రార్జితంగా సంక్రమించినట్లు ఇతరుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదైందన్నారు. అనంతరం ఆ భూములపై క్రయవిక్రయాలు జరిగాయన్నారు. ఆన్‌లైన్‌లో మ్యుటేషన్ చేసిన అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ శారద ఆందోళనకారులనుద్దేశించి మాట్లాడుతూ క్రయవిక్రయాలు సాగించి ఆన్‌లైన్‌లో మ్యుటేషన్ చేసుకున్న వాటిపై విచారణ చేస్తామన్నారు. అనంతరం ఆందోళనకారులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకటేష్, మాల్యవంతం కుళ్లాయప్ప, రవికుమార్, రమణ, వెంకటనారాయణ, వెంకటస్వామి, రాజా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు

తల్లిపాలు అమృతంతో సమానం


ధర్మవరంలో తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లక్ష్మి


కటారుపల్లిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


కనగానపల్లిలో తల్లిపాల ప్రాముఖ్యత వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి

ధర్మవరం అర్బన్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని సీడీపీఓ లక్ష్మి తెలిపారు. ధర్మవరంలోని యాదవవీధి సెక్టార్ పరిధిలోని బోయవీధి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పెరుగుదలకు, తెలివితేటలకు ఆధారం తల్లిపాలేనన్నారు. ఆరు నెలలు వచ్చే వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే తాగించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణిమాల, ఏఎన్ఎంలు వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, శివకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, కవిత, చంద్రకళ, హెల్పర్లు ముబీనా, భాగ్యమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేష్టమైనవి

గాండ్లపెంట: తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు. మండల పరిధిలోని కటారుపల్లి, సామాలగొంది క్లస్టర్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం తల్లిపాల వారోత్సవాలపై సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిపాల వల్ల శిశువును న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు పార్వతమ్మ, సీహెచ్ఓ రష్మి, రమాదేవి, హెచ్ఏ రవి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, క్రిష్ణవేణి, మాధవి, సునంద, శ్వేత, అచ్చమ్మ, రెడ్డెమ్మ, భాగ్యమ్మ, గౌరి, సామాలగొంది సరస్వతమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

కనగానపల్లి: తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ఇచ్చే ముర్రుపాలు చాలా ఆరోగ్యకమైనవన్నారు.

తలుపులలో ర్యాలీ...

తలుపుల : తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీపా అన్నారు. మండల కేంద్రం తలుపులలోని 1, 7 అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు తల్లి పాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డతో పాటు 6 నెలల పిల్లల వరకు తల్లి పాలు ఇవ్వడం వలన రోగ నిరోధక శక్తితో పాటు, శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, లలిత, పుణ్యవతి, మునెమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

తల్లిపాలు ముద్దు.. డబ్బా పాలు వద్దు

తనకల్లు: మండలంలోని బొంతలపల్లి, చీకటిమానిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో 'తల్లి పాలు ముద్దు – డబ్బా పాలు వద్దు' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ధర్మరాజు, సీహెచ్ఓ చందన, మహిళా కార్యదర్శి మాధవి, ఏఎన్ఎం లక్ష్మి, కార్యకర్తలు రామక్క, భారతి, మీనాక్షి, అలివేలు, దిల్షాద్, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

ముదిగుబ్బ: మండల పరిధిలోని దొరిగిల్లు, ముదిగుబ్బ–1 అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముదిగుబ్బలో సూపర్‌వైజర్ చంద్రమ్మ, ఐకేపీ ఏపీఎం హేమలత, జీఎంఎస్‌కే విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు వన్నూరమ్మ, శ్రీదేవి, హెల్పర్ మస్తానమ్మ, దొరిగిల్లులో ఎంఎల్‌హెచ్‌పీ భారతి, ఏఎన్ఎం చక్రి, ఉమాదేవి, సరస్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందుమతి, నాగమణి, బీబీ, సురేఖ, మీనా, రామాంజినమ్మ, కాంతమ్మ, వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

ముర్రుపాలలో పోషకాలు ఫుల్

చెన్నేకొత్తపల్లి: తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష అని మండల వైద్యాధికారి రవినాయక్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ప్యాదిండి, న్యామద్దెల గ్రామాల్లో ఎన్ఎస్ గేట్ వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ తల్లిపాలలో చిన్నారులకు కావాల్సిన అన్ని పోషకాలూ లభిస్తాయన్నారు. న్యామద్దెలలో క్షయ వ్యాధి రాకుండా బీసీజీ టీకాలు వేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ పద్మావతి,ఆరోగ్య కార్యకర్తలు విష్ణువర్ధన్,వెంకటేష్, ఏఎన్ఎంలు మాధవి,ప్రమీలమ్మ, అశ్విని, ఎంఎల్‌హెచ్‌పీలు ఝాన్సీ,ప్రియాంక, సూపర్‌వైజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు

కదిరి టౌన్: శ్రావణ మాస తొలి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, సైదాపురం ఆంజనేయస్వామి ఆలయంలోని శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నృసింహాలయంలో మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సిరిసంపదలు కలిగించు తల్లీ...

బత్తలపల్లి: సిరి సంపదలు కలిగించాలని వరమహాలక్ష్మిని కోరుతూ మహిళలు మండల వ్యాప్తంగా ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మాంసాహారం ముట్టకుండా పూజా కార్యక్రమాల్లో మునిగిపోయారు. పోట్లమర్రిలోని యల్లమ్మ, పెద్దమ్మ, గంటాపురంలోని మారెమ్మ, బత్తలపల్లిలోని బళ్లారి దుర్గమ్మ, గంగమ్మ, మహాలక్ష్మీ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ మాసంలో ఆచరించే పూజలు, ఆరాధనలు, అర్చనలు, వ్రతాలు, జపాలు, హోమాలు సత్వరమే సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసంగా వేదంలో పేర్కొనట్లు పండితులు చెబుతున్నారు. పోట్లమర్రి ఆంజనేయస్వామికి శ్రావణమాస పూజలలో భాగంగా ఆకుపూజలు నిర్వహించారు.


కదిరిలో శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు


బత్తలపల్లిలో విశేష పూజలందుకుంటున్న మహాలక్ష్మి

ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న యాజమాన్యం, విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: గోరంట్ల సమీపంలోని భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ(బీఈఎస్‌టీఐయూ)లో సోమవారం ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. క్యాంపస్ పెవిలియన్‌లో విశిష్ట అతిథులు, విద్యార్థులు, అధ్యాపకుల సమక్షంలో ప్రారంభించిన ఇంక్యుబేషన్ సెంటర్ ఒక మైలురాయిగా నిలిచిపోతుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఇంక్యుబేషన్ సెంటర్ డైరెక్టర్ స్టాలిన్ వైస్ చాన్సలర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, రిజిస్ట్రార్ జైప్రకాష్, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ లక్ష్మీనరసప్ప, డీన్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ రామ్‌గోపాల్ తదితరులు ప్రసంగించారు. విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన ఆవిష్కరణలు అభివృద్ధి చేయడానికి వివిధ వర్క్ షాప్‌లు, మెంటర్‌షిప్‌లు, నెట్ వర్కింగ్ అవకాశాలను అందించడమే ఇంక్యుబేషన్ సెంటర్ లక్ష్యమన్నారు.

రింగ్ ట్రెంచ్‌కు దరఖాస్తు చేసుకోండి

తలుపుల : మామిడి సాగు చేసిన రైతులు ఈ నెల 14లోగా రింగ్ ట్రెంచ్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ హారూన్ రషీద్ సూచించారు. మామిడి సాగు చేసి ఐదేళ్లు పైబడిన రైతులు ఉపాధి హామీ పథకం కింద పొలంలో రింగ్ ట్రెంచ్ తవ్వకాలకు చేపట్టవచ్చని, ఆసక్తి గల చిన్న, సన్నకారు రైతులు జాబ్ కార్డు, సర్వే నంబర్, పట్టాదారు పాస్‌బుక్‌తో ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.